ఓం శ్రీసాయిరాం

శ్రీసాయి సుదర్శనగీత

సృష్టి పటలం



ఓం శ్రీ పరమాత్మనే నమః

సాయి శివహరి ఓం

# శ్రీసాయి సుదర్శన గీత

## ద్వితీయ అధ్యాయము — సాంఖ్యా యోగము

(1) (05-09; ఏడవ రోజు పారాయణము)

| | |
|---|---|
| 1. | నమో నమ ఓంకార జ్యోతిస్వరూపాయ - నర్తించు భక్త భువనైక భూషణాయ<br>ఓం ఓం ఓం జ్వల జ్వల జ్వల జ్వల - జ్వలాంతర ప్రజ్వలమాన జగజ్వలిత జగజగన్నాయకాయ...! |
| 2. | ఓం ఓం ఓం ఓం హరి ఓం - వచన సప్తస్వర భూషణ విభూషణాయ<br>సాయిపురీశ సకలేశ్వరాయ - భంజన ప్రభంజన దుష్టవిభంజనాయ<br>ఆర్తత్రాణ పరాయణాయ పత్రీపురీశ్వరాయ - పరమేశాయ నమో నమః ...! |
| 3. | భం భం భం భవ భంజనాయ - తకిట డమరు గనగన మృదంగ<br>ఫణీంద్రాయ నమో నమః - నమో నక్షత్ర మండలాయ...! |
| 4. | నమో నమోస్తు ఉమాసుమాలంకృతాయ - కుసుమ శోభితాయ, దీపజ్వలితాయ<br>జ్వలితాయ నకనక ధిమితక తకధిమి - ప్రణయ నృత్యాయ, ప్రణవాకారాయ<br>ఓం నమ ఓం నమశ్శుభాయ శోభితాయ - శిరిడి వాసాయ నమో నమః ...! |
| 5. | అను విను కను నమో నమాయ - ప్రధమ గణనాయ ప్రభంజనాయ<br>ప్రదీప్తాయ తకిట తకిట మృదంగ - డమరు క్రమ నాట్య ప్రణయాంకితాయ<br>నిగమ నిగమాంతరాయ భృంగాయ - శృంగార శక్తి స్వరూపాయ...! |
| 6. | ఓం నమఓం ఓం నమఓం - ఓం నకారరూపాయ గంభీరాయ<br>పరమేశ్వరాయ పత్రీపురీశ్వరాయ - లోకాయ నాథాయ నటరాజాయ నమో నమః ...! |

(2) (06-09; ఎనిమిదవరోజు పారాయణము)

| | |
|---|---|
| 7. | కనక కనక కన్నావో నను - నేనెవరో కనలేవు ముందు నీవెవరో తెలుసుకో<br>మదినన్ను తలచుకో నీకు నీవెవరవో - దర్శించుట ఎరుగవు నన్నేల పట్టేవు ఓ పిరికి నరుడా...! |
| 8. | చినికి పోయేటి బ్రతుకు — మురికినే తొలగించు - ముదిమి వచ్చు వరకు — ముందు చూపెరుగవే<br>రోగాలు దుఃఖాలు రొప్పులో నీవుండి - నిను గాంచుటె ఎరుగవే, నను గాంచగలవే...! |

| | |
|---|---|
| 9. | అలసిపోయిన బ్రతుకు - అరుపు ఎట్లొచ్చురా - దేవుడే లేడంచు ఆ రంకెలేటికి<br>ఈ పరుగు పందాన నను పట్టలేవు - నీ బ్రతుకు తెలుసుకో సద్గతిని మలచుకో...! |
| 10. | నీవున్న ఇల్లు నీది కాదోయి - పాడైన ఇల్లంత పరిగెత్తి పోవా కొత్త ఇల్లొకటి మరి కట్టుకోవా<br>కాయము వదలి పరకాయము మాని - పరిపరి జన్మల నెత్తంగ లేదే...! |
| 11. | ఏపేరు ఏ ఊరు నిపుడు, దూరిన కొంప నీవున్న ఆ బొంది నీది కాదోయి<br>నువు పలుకు నీ పలుకు నీది కాదోయి - నీవున్న ఆ బొంది అద్దె కొంపోయి...! |
| 12. | ఇల్లొకటి మారినా, ఆ బొందిలో దూరినా - నీ శరీరమే క్షీణించు ఇల్లు కాదందువా<br>నీవే ఆ ఇల్లందువా కాదు - కాదు కానేకాదు...! |
| 13. | కాయంబు వేరైన నీ ఆత్మ గనుము - చెప్పకనే చెప్పు మిపుడు నీవెవరో.. ? |
| 14. | ఆత్మదర్శనమందు — అజ్ఞానము వదులు - ఆపైన నన్నెవరో అరసి చూడవయ్య<br>నళినీ దళముపై నీటి బొట్టవుదువో? - తామరాకువు కాదు తరచి చూడుము నిన్ను...! |
| 15. | నాది నాది అన్నది నాదన్నది ఏది? నీది నీది అన్నది నీ కేది మిగిలేది?<br>నీవాత్మ వవుదు పరమాత్మను చేరు - సాయిగీతను చెపుతాను పరిప్రశ్నలేయకు...! |
| 16. | ఆత్మ సాక్షాత్కారం అవనిలో దొరుకునా? యోగుల జన్మలు ఏరుల జన్మలు ఎరుకేల లేదు?<br>ఏ ఏరు పారినా, ఏ పేరు పెట్టినా - పరికింపనంతా అది గంగకాదే...! |
| 17. | ఏ దారి చేరినా ఏ పూజ సేసినా - ఏపేరు అరసినా ఎందెందు తిరిగినా<br>అవనిలో అందరి పూజలు చేరేవి - పరమాత్మకే గదా... ? |
| 18. | శివునాజ్ఞ లేనిదే చీమయినా కుట్టునా - పాలించు వాడను పలికించు వాడను<br>ఆజ్ఞ ఇచ్చు వాడను ఆలించు వాడను - నారాయణుండనై సృష్టి నడిపించు చున్నాను...! |
| 19. | చేసేది నువ్వయిన చేయించునది నేనే - ఆత్మ యోగమిది అవలోకించి చూడు<br>ఇంత చెప్పిన నే నేవరందువేమో - చేతగాదని చెప్పు చెంప వాయింతు...! |
| 20 | విర్రవీగకు నీవు, వెర్రి నాగన్న - అన్ని బాగున్నా నీకున్న అహంకారం మిన్న<br>వెలుగులో నన్ను కనలేవు కన్నా...! |
| 21. | చిక్కులున్న ఏడుస్తావు చీకటున్న ఏడుస్తావు - కష్టాలు నీకున్న నసుగన నేడ్తువు<br>కలిమిలో నీవున్న, నీ కళ్ళముందున్న - కనిపించునా నీ కళ్ళకు పొరలున్న...! |
| 22. | ఉన్ననాడు నాల్గు విత్తుల ఇవ్వ నేడ్తువు - లేనినాడు లేవంచు నేడ్తువు<br>నీ ఏడుపు మాన్ప నే నేడ్వవలెనె - ఏడ్పులో పుట్టావు ఏడుస్తు పెరిగావు...! |

| | |
|---|---|
| 23. | ఏమిరా నిన్నింక సవ్యముగా చూతునో - ఎపుడురా నన్నింక సవ్యముగ చూతువో<br>స్థితప్రజ్ఞుడవై జీవించుటేనాడో - సాయిగీతను చెవిపెడితే 'చెడు' పోవుగదటన్న...! |
| 24. | నిత్యాగ్ని హోత్రిలా నిరతాన్న దాతలా - దక్షిణ రెండు రూకల నివ్వ ఆ పోజు లేమిటి,<br>ఆ డాబు లేమిటో - పుచ్చుగింజలు దానమిచ్చు —<br>ఓ చచ్చు దద్దమ్మ నను దర్శించలేవా, నిన్నేమందు..? |
| 25. | దరిద్ర నారాయణుడంచు నన్నందరందురే - ఇంత గీతను విన చెవి పెట్ట లేవు<br>నీవేమి మారెదవు నిన్నెవరు మార్చెదరు - దర్శించ లేవైతివి, వారిలో పరమాత్మనైతి...! |
| 26. | సహనము మించిన సంపదే లేదు - సద్బుద్ధి గాంచిన శతరుద్రుడివి గావా<br>నీతి నీలో ఉన్న నీకెవరు సాటి - భువిలోన దివిలోన రాణింతువు గాదే...! |
| 27. | సద్గుణమును కనుము సాయిమాటలు వినుము - సాయిగీతను చెప్తున్న చెవి పెట్టి వినుము...! |
| 28. | స రి గ మ ప ద ని స - సప్తస్వరములు ఏడు -ఆరోహణ అవరోహణ క్రమములో - అవి నడుచు..! |
| 29. | పదము పదమున మార్చు రాగాల నేర్చు - శృతి చేయి నీ హృద్వీవీణ వృథ్విలో నిలుచు<br>పలికించు రాగాలు పలు విధములయిన - నడిపించు సరిగమల సంగీత మొక్కటే...! |
| 30. | మనిషి మనిషికి నాత్మ వెలిగేది ఒకటే - సంగీతమును నేను సరిగమలు మీరు...! |
| 31. | శృతి నిలిపి నను శృతి జేసి చూడుడి లయింతు నాలో<br>నవభక్తి రాగాల ముక్త కంఠమున చెప్పినన్ ముక్తినిత్తు<br>పాడు పావన గంగలో సరిగమ పదనిస, సనిదప మదనిస - సంగీత ప్రహారాల సరిజేర నన్ను<br>సాయిగీతను పలికితిని పావనులు కండి...! |

## (3) (07-09; తొమ్మిదవ రోజు పారాయణము)

| | |
|---|---|
| 32. | నీవు నేనని భేదం బేల చూపెదవు - ఖేదంబున కుందుటకు కారణంబగు నదె<br>రాగద్వేషంబుల మూలం — 'నీవు' 'నేననే' భేదం...! |
| 33. | ఆమోదించితివేమి ముదంబున - హరి గాంతువు నీలో, నాలో...! |
| 34. | కలదందురు సర్వోపగతుడైన హరి సకలములందు<br>నీవు నేననే భేదము చూపక, కలిమి లేముల నెంచక<br>సమవర్తియై సర్వ జీవులన్ నిండు హరియున్ - దరియంగ లేవే? ఏటికి మానుము నీ భేదబుద్ధి..! |

| | |
|---|---|
| 35. | చిటికే మాటికే నాది, నేనన్న యహంకారం బేల?<br>అది అణుచును గాదే నధమపాతాళమున కడుగంటన్,<br>రాగద్వేషముల ద్వైతర భావము మానుము - హరి సర్వోపగతుడై గానంగ వచ్చునే...! |
| 36. | శ్రీకృష్ణార్పణమస్తు అనుచు కలిగినదేదో మంచిగ పంచుము -<br>'నీ' 'నా' అనుచు పొరపొచ్చముల మాటల్ ఆడెదవేల?<br>నీ జన్మకున్ ఇంకేమి - చేయంబోవు క్షేమంబైన పనేమి లేదా..? |
| 37. | జన్మ జన్మాల బంధాల సంబంధీకులమంతా - మనిషి మనిషిలోనున్న మాధవాంశ చాలదా,<br>మన మన్న మమతను పెంచుటకు - ఇంకేటికి 'నా' 'నీ' అని అహంకారపు కూతల్...! |
| 38. | కూరిమి చెప్పను, కోరితిరి గదె మీరన్న - ఈ భగవంతుని కూరిమి బిడ్డలంచు,<br>మనది వసుదైక కుటుంబమంచు - పదెపదె పడిగాపులు పడితినే గాని<br>మనమన్నమాట అన్నా రాదె నీ నోట ఏ పూటకైనా...! |
| 39. | నాదు తత్త్వంబు నీవు గాంచి ఉన్నా - మది మదిని నారాయణుండు నరయుగాదే..! |
| 40. | మనసు మథించి చూడు - కనిపించడా ఆ నవనీత మానస చోరుడు కన<br>జగన్మోహన మురళీరవలోలుడై - భువి బృందావనమై నిలుచు గాదే..? |
| 41. | మోహన మురళీ రవంబు సరళి గన క్రిమికీటక పశుపక్షి<br>నదీనదంబుల్ సృష్టిలో 'నీ'... 'నా'... భేదముల్లేక, లయించి లయించి హృదయాంతర<br>వర్తులై దోచిరే? ప్రతిప్రాణి భగవత్ స్వరూపులై...! |
| 42. | నీవు మురళీ రవంబు పలికించకున్న మానె - మాటన పిలుపున పలుకున అపస్వరములు పల్కక<br>మనమంతా వీణ తంత్రులై సమతా సంవర్తులైతి మేమి —<br>సృష్టిని తోచునే మనిషి మనిషి శ్రీకృష్ణ రూపమై...! |
| 43. | సర్వే జనో సుఖినోభవంతన్న వాడే - సర్వ సృష్టిని నారాయణాంశ చూడగలడు<br>నాది, నీది, నువ్వు నేను నన్న అపకూతలాడు —<br>వాడేటికి నరకానికిపోక నిల్చినదాశ్చర్యము కాదే..? |
| 44. | మనిషి మనిషికి అంతర పొంతనంబుల్ చూడు —<br>వాడేటి మనుషుడో? కోకిల గుంపులో కాకిగాడే? మాటలకు మెచ్చి వరము లిత్తురే దేవతలు<br>మాటల మధుర కవనముల కరగింప నేర్తురే ధరణిన్ కవులు —<br>కఠిన శిలలన్ కరిగింప కమ్మని వాక్కు మారే కావ్యములై...! |

| | |
|---|---|
| 45. | చెప్పంగ నేర్చిన వారు ఉర్విలో నెందరు లేరు - మమతలు పెంచు మాటొకటి మనమన్న చాలు<br>అన్నా ! ఇంకెంతని చెప్పదును బుద్ధుల్ - ఈ ప్రపంచమే మనమందరకు నీడ నిచ్చు ధర్మసత్రమే...! |
| 46. | ఈ సత్రంబున నీది నాదను భేదమ్ము లేదు - నీ జీవిత సుదీర్ఘ ప్రయాణంబులో<br>బడలిక లేక పది నిముషంబుల్ - విశ్రాంతి నిచ్చునది ధర్మశాల...! |
| 47. | దీనిని నీ, నా అని పంచుట కేమి లేదు, అది పరుల సొమ్ము గాదు,<br>నీ సొంత భవనంబు గాదే ఇసుమంతైనన్ సోకులు పోయెదవేల ఎరువుల సొమ్ములుంచనిది -<br>అరువుల సేలుగా నీ బ్రతుకు నంతమొందించున్...! |
| 48. | పొంతనల్ లేని మాటల్ చెప్పితినని - పొగిలి పొగిలి ఏడ్చెదవేల?<br>మూడు పొర్లింతల్ పెట్టినన్ - పోవునా నీ శునకంపు బుద్ధి..? |
| 49. | కనకపు సింహాసనము చూపెదనన్న - కాళ్ళంబడ్డ ఎంగిలి మెతుకులేల కెలికెదవు<br>రాగద్వేషాలు హరియించు, హరి ఎదను దోచు - చూడు చూడు అవని విశ్వాంతరంగుడై<br>సమాంతర వర్తుడై నర్తించు హరుని చూడు...! |
| 50. | భాషించు భాషించు, భాసించు — సమాంతర వర్తియై, సర్వేసు వాక్కునై,<br>ఆ భగవంతుడే తొంగి చూచు - వర్తించు వర్తించు హృదయాంతరంగుడై<br>అవని లీలల అంతర స్వరూపుడై శ్రీ రంగుడైన ఆ పాండురంగడు,<br>జగమున నిండిన జగన్నాథ రథ చక్రంబులై - నడిపించు, నడిపించు, నిను నడిపింతును...! |
| 51. | భాసిల్లు జ్యోతివై, వెంట ఉండేటి జాతివై - జ్ఞానపు జ్యోతివై, సర్వజగన్నాథుండనై<br>మనిషి మనిషికి దోచు, మనసు మనసుకు దోచు - మనమన్న మాటన్న, మనసున్న మనిషన్న<br>అతడే మాధవుడగు, మరి చెప్పనేల? |
| 52. | రాగాలు హరియించు సర్వభోగాలు పరిమార్చు - ద్వేషాలు హరియించు సర్వదోషాలు వదిలించు<br>కదిలించు కదిలించు కమనీయ వాక్యాల - రమణీయమై శ్రీరంగుని చేరేటి స్తోత్రాల వల్లించు...! |
| 53. | కాదేటి, నీదేటి, నాదేటి, అంతా సర్వరంగుడైన శ్రీరంగుని సొత్తు కాదే?<br>అతని పొత్తునకై మీరేద్వవలెనే కాని - నీది నాదని ఆస్తులకేటి తన్నుకు చచ్చెదవు<br>తరించు మార్గము ముందర ఉండగన్...! |
| 54. | రాగద్వేషంబుల రానీకు నీలోన - అది సూది మొన మోపినంత చోటిత్తువేని<br>పరిమార్చు పాపాల కీలలన్ — పరమాత్మ జేరు దారిన్ కానగరాగ<br>మనిషి మనిషిన ద్వేషభావంబులు, రగిలించునది...! |

| | |
|---|---|
| 55. | రాగద్వేషంబు రగిలించు, క్రోధంబు కలిగించు<br>క్రోధంబునన్ నిన్ను కోతియై ఆడించు చేయించు పనులు<br>ఆ పనుల పాపాలు తాపాలు కలిగించ - తరియించగా నీకు తరుణోపాయంబేది...? |
| 56. | రాగద్వేషాలు హరియించి హరిన్ కామించు - నీవు స్థితప్రజ్ఞత నిల్చినన్ నాకు నిశ్చింత...! |
| 57. | చింతలన్ బాపుమా వంతలన్ బాపుదున్ - ద్వేషాల రోషాల కలతలన్ పడి<br>కలతల కన్నీళ్ల కష్టాల మయములా - కోరేటి బ్రతుకదా?<br>కోరిన నిచ్చు కల్పవృక్షమున్ కాంచలేకున్నావు...! |
| 58. | కంటకంబుల బాట కన్పించునా నీకు పూదోటై ఏపూట నీనోట కరుణించమని వేడ కావేటి రంగడై<br>నీ కళ్ల పొరలు విప్పింతు, దరిజేర్తు నిన్ను - రంగరంగ శ్రీరంగ, ఓ పాండురంగన్నా<br>రంగరంగ వైభవంబున బ్రతుకు నడిపింతు కాదే..?<br>అన్నన్న ! నామాట వినుమన్నా ! సులువన్నా ననుజేరు బాట...! |
| 59. | నీమది రాగద్వేషాల అలవాలంబు చేయకు - మది పవిత్రమైన దేవాలయంబు కాదే...? |
| 60. | తరతమ భేదము లేటికి, పరమత మాఢ్యము లేటికి?<br>కులమతముల కుళ్ళు కలిగించు వర్ణము లేటికి..? పూదోటన్ పూలన్నీ రంగుల వెలయించినన్<br>చేరునది శ్రీరంగని పదమే కదా...? |
| 61. | మనమున అన మనమంతా - మానవ మతమే గదా !<br>మమతను వెలిగించు - మాధవుండే మదిమది నిల్చున్...! |
| 62. | ఒక కుదుటికి పుట్టిన బిడ్డల్ - నొక చెట్టుకు పూసిన పూవుల్<br>కొమ్మ కొమ్మన రెమ్మ రెమ్మన — కూకటి వేళ్ళ ద్వేషభావంబుల<br>మాపకున్నా అది కుళ్ళిన తరువై — ఫలము విషపూరితమై<br>ద్వేషంబున రగిలింప కాండమున్ హరియించి కూలిపోవునే...! |
| 63. | నీ మదిన్ నే జెప్పిన మాట నిలిపితి వేని - మందాకినీ తరంగ రంగమై చల్లని<br>సుమధుర మనోహర పిల్ల తెమ్మెరల స్నానము చేయింప<br>నీ మనసు మురికిన్ కడిగిన మంచి మౌక్తికమై నిల్చేదన్ —<br>రాగద్వేషములు ఆలవాలము సేయకు - మది పవిత్రమైన ఆలయము గాదే...! |
| 64. | మంచి గంధపు పూతలేటికిన్ - నీ మనసు కుళ్ళు నీ పిచ్చి కూతలేటికిన్<br>నేను చెప్పిన సూక్తులు వింటివేని - పంచ తత్త్వాల నరసి పరవశింతువు గాదే...! |

| | |
|---|---|
| 65. | నేచెప్పిన బుద్ధులే, సుద్దుల్ - సయోక్తుల్ చతురోక్తుల్<br>అక్షర లక్షల సవాలక్షల అర్థాలతోచి - నా హృదయమున్ దోచు, స్థిత ప్రజ్ఞుడవుదువే...! |
| 66. | నాకేది అర్థంకాదని ఒప్పుకొన్నచో - నిప్పుడైనన్ మించినది ఏ మున్నది ?<br>ఆశ్రిత రక్షకుండ - శ్రిత పక్షపాతము సూపక ఆశ్రయ మిత్తు<br>ఆశల విడనాడి నను జేరవేల - అన్నన్నా ! నీ అహంకారంబు నింకన్ విడువంగలేవే...! |
| 67. | తోకతెగిన పాముపై ఏల బుసకొట్టుట.? అవు - ఆశ్రయము ఇచ్చెదనంటి, అహంకారము విడనాడు<br>అన్యథా శరణం అన్ననాడు - రక్ష బిక్షనిత్తు ఏ శిక్షలు వేయక...! |
| 68. | రాగద్వేషములకు ఆలవాలము సేయకు మది - అది పవిత్రమైన ఆలయం కాదే ఎంచి చూచినన్...! |

## (4) (08-09; పదవ రోజు పారాయణము)

| | |
|---|---|
| 69. | మీ మానవ గుణగణముల నెంచగ - అవగుణంబుల కైన వశంబునవునా?<br>నమ్మశక్యమా సాయినాథునకు - నమస్కరించ మస్కారం కాదుగదా, మరిమరీ చూచితి...! |
| 70. | లేనిదానికి ఏడ్తురు, నిచ్చిన నేడ్తురు, ఈయకున్న ఏడ్తురు<br>ఉన్నది గని సంతోష మందగలేరు అవతల వారికున్న ఏడ్తురు<br>ఈ ఏడుపుల అవగుణములు, నా కన్నా ! నీ ఏడ్పు మాన్ప నే ఏడువంగ నొచ్చెనే...! |
| 71. | పుట్టి మునిగినట్లు - పురిటి కందునించే ఏడ్తురు, ఏడ్పుల మార్పు, నాకుదోచె<br>ఆరోహణ అవరోహణ - పోరున్ హోరున్ నేడ్పుల గోడున్...! |
| 72. | ఏడ్చి ఏడ్చి నీ గోలల గోడుల - నా లీలలు మరుగున పడె ఏమి<br>దుఃఖాంబోధి, దేరియాడ చూడ - ముందున్నది గదా ముద్దులపట్టి !<br>ఎందుకు ఏడ్చెదవు, నేడ్పు మాని నొక్కింత చెప్పు...! |
| 73. | ఏడ్పుల గోల నాకు వడగాల్పుల గాసి వడితి<br>నేనెన్నో ఆశలిడితి నీపై, ఆదర్శభక్తుడవంచు భవముక్తుడవంచు...! |
| 74. | దుఃఖాంబుధి మునిగిన నీవు నన్నేమని గాంతువులే !<br>రా ! రమ్ము, నీ ఏడ్పుల ఘోర సముద్రము ఇట నిండిపోదులే...! |
| 75. | ఒక పరి నా కంటబడు - నీ కంటికి నీరంటుట కానవు నా కరుణాంబుధిలో...! |

| | |
|---|---|
| 76. | ఎందుకు ఏడ్పుటెందుకు? ఏడ్చినా తదుపరినైనా చెప్పు - చెప్పినా చెప్పి ఏడ్వు,<br>నీ ఏడ్పుల గోలలేటికో? నీ ఏడ్పుల ఓ గాటగట్టి ఆ నోటన్<br>సాయినాథ శరణంబన్న మాట వినకుంటివే...! |
| 77. | కలిగినంత కలిమి నీ కిచ్చితి - కంట నీరిడిన కారణంబేమి?<br>చూడ కన్నులిచ్చితి - కాంచనములున్న కలదే నీకు గొప్ప...! |
| 78. | నీకు కళ్ళిచ్చితి కాళ్ళిచ్చితి కరములిచ్చితి గాదే? కలదన్నవా? దీనికన్న మిగిలిన సౌభాగ్యముల్...! |
| 79. | కైసేయ కరములు నీకిచ్చితి - కంట నీరు తుడవ కడుపుగొట్టంగ కాదు<br>పెంపు మీరగ పెంచ తల్లిదండ్రుల నిచ్చితి - నీదు క్షేమంబరయ ఇల్లాలి నిచ్చితి...! |
| 80. | కష్టించి పనిచేయ కాయంబు నిచ్చితి - నీడకై నీకు ఇల్లు నొకటిచ్చితి<br>ఇన్నిచ్చినందుకు భగవంతు మెచ్చి - కైసేయని కరములు, నీ బ్రతుకేటి చెప్పు...! |
| 81. | బుద్ధి నిచ్చి చదువిచ్చి సౌఖ్యంబులిచ్చినా - ఏడుపు రామాయణంబు నింకేటికో చెప్పు<br>ఎదుటోడు ఇల్లుపై ఇల్లు గట్టె ననుచు - నీ వేలుపై గోరొకటి మొలిచెనే యనుచు<br>నీకేదో లేదంచు, భగవంతుడేడంచు - వాజమ్మవై నీవు వెదకు కష్టాలు<br>వెక్కి వెక్కి ఏడ్పింప నింకేదో వెదకు కష్టాలు - చెప్పరా నా కన్నా ! చెప్పి చెప్పి ఎక్కెక్కి ఏడు...! |
| 82. | చెప్పేడుపు వెక్కేడుపు - నక్కి ఏడ్వవలెనేల.. కుంగిపోనేల.. కుళ్ళి ఏడ్వవలెనేల...?<br>ఏడ్పుటకే అన్నా నీవు పుట్టినది? - ఏడిపించుటకు నేనున్నదందుకు కాదు...! |
| 83. | కారణంబు సెప్పు తుడుతు నీ కన్నీరు చిన్నోడివైతేను,<br>చిన్న పిల్లోడి వైతేను గిలగిచ్చి నవ్వింతు, గిరగిర తిప్పిస్తూ<br>ఛీ ఛీ యనుచు బోసి నవ్వుల కురిపింతు - ఛీ ఛీ అన ఏళ్ళ నీకు ముంచుకవచ్చె..! |
| 84. | నవ్వింతు నీ బ్రతుకు - పండింతు నాల్గు రెట్టుల ఫలము నాదరి చేరెదనన్న<br>దండింతు దక్షతగ - దారి జూపింతు నిష్టముగ కృష్ణ పరమాత్మ నవుదు...! |
| 85. | నిను కిలకిలలు పెట్ట వెన్న ముద్దలు మింగింతు - మింగు మింగు ఏడ్పు మిన్ను మన్ను నేల<br>ఏకంబుజేతువు కన్నుల నీర్వెట్ట కారణంబేమో ఇపుడైనా చెప్పిన<br>నీ కన్నీరు తుడిచి కమలాక్ష పదములు చేర్చెదను కానే...? |
| 86. | నీకే తెలియని ఏడుపు, నాకేల తెలుపు - తేట తెల్లముగా తెలుపు, ఇది నా మనసు తెలుపు<br>మనల కలుపు, మధ్య సయోధ్యన్ నిలుపు...! |
| | |

| | |
|---|---|
| 87. | ఏడుపులోనే పుట్టి ఏడుపులోనే చచ్చి - ఎదురొచ్చిన వారలన్ ఎక్కెక్కి ఏడ్పించి<br>నువ్వేడ్చి, వాడేడ్చి, ఏడ్చి ఏడ్చి - ఎందుకురా, నీ ఏడ్పుల నన్నేడిపించెదరు... ? |
| 88. | మనసునొచ్చినదన్న - నినునెవరు గిచ్చెదరన్న — అనుకున్న ఏనాడన్న..నీ ఏడుపు మానెదవటన్న.! |
| 89. | ఏడుపు గొట్టంచు ఓ పట్టి ! నిన్నెత్తి, రెండుగొట్టి<br>నే పట్టించుకోను — చెప్పింది వినకున్న చెడిపోవుదురన్న...! |
| 90. | ఏడుపుల రామాయణము రచింప నే వ్యాసుడో భాసుడో<br>ఎవడో దిగిరాడన్నా ! నీ దుఃఖ భారాల భారతము మరిరాసి, సరిరాసి<br>బాధితుల చేయంగ నెవడురా చిన్నా...ఎపుడురా కన్నా.. !<br>నీ రోదనల రోగం ఏనాడు కుదురన్న ! చెప్పేద్వేరన్న...! |
| 91. | నవ్వరా నా తండ్రి నవ్వరా కన్న - నీ నవ్వు నలుగురిని రగిలించి పొంగిలి పొరలి<br>మనసారా పడిపడి పదిమంది - బ్రతుకుల పొంగి నవ్వించు నవ్వరా ! నా తండ్రి నవ్వరా కన్న...! |
| 92. | పారేటి ఏటిలా హోరెత్తి నవ్వించు - సెలయేటి గలగలలా కిలకిల రవళుల<br>జగమంత నవ్వులై నవ్వు నవ్వుల పూలు - జగమంత విరాజిల్ల నవ్వించు నవ్వించు నలుగురిని...! |
| 93. | నవ్వులున్న చోట నారాయణునికి ఆట - ఆడించు, పాడించు జగతి తేలించు<br>నవ్వుల పువ్వుల నాట్యాల నర్తించు నర్తించు - కల్మషము వీడి కలకలల నవ్వుల నవ్వు నవ్వించు...! |
| 94. | ఆనంద వాహినుల నీ నవ్వు కిలకిలల - కిల కిలా రవముల నా మదన మోహనుడే<br>మోహన మురళీ గానము రవళించు - పులకింతు గాదే ! జగమంత నా పిలిపు...! |
| 95. | జగములు నవ్వించ జగజ్జనకుడు హర్షపులకాంకితుడై<br>అవనంత పులకింత పుణ్యాల — వర్షాల వల్లరు లవనియంత మురళీ ధ్వని రవళించ<br>ఆశలు, ఊసులు మరచి మోహన గానమాధురిలో నవ్వులై, పువ్వులై పులకించి పొండి...! |
| 96. | ముదముగ బ్రతుకుడీ ఉన్న మూన్నాళ్ళు - ఆనంద తరంగ పులకాంకితులై<br>పుడమిన శ్రీరంగనాథుని పుణ్య పదములు - చేర పుట్టిన జన్మల్ కావో, నాడు సార్ధకములు...! |

## (5) (09-09; పదకొండవ రోజు పారాయణము)

| | |
|---|---|
| 97. | కలిమి కలిగిన గాదు స్థితిమంతులు - కలిన్ నీయందు అవగుణములు అంతరించ<br>సద్గుణముల ఖనివై, స్థితప్రజ్ఞుడివై - నలరారిన రోజే అసలైన స్థితిమంతుడే...! |
| 98. | లేనిదానికి ఏడ్వక - కలిగిన సౌభాగ్యముల పొంగక<br>కష్టసుఖముల కృంగక - నొకపగిది చూచెడివాడే స్థితప్రజ్ఞుడు...! |
| 99. | ఆకలి అవగుణములు, అతిదురాశలు విశృంఖలమై విహరించు<br>దాసోహం అన్న దహించి దావలి గుంటన్ పడవేయన్<br>దాసోహమన్న దాహం పెంచునేగాని దరిద్రము తీర్వనేరదు<br>దామోదరున్ జేరు మార్గములేక దావలి గుంటయందు<br>పిల్లివై, కుక్కవై, నీ అవగుణముల నశింతు ఏ దారులేకనే...! |
| 100. | కలిమిని కలగదు తృప్తి, కామితములు తీరిన మరి ఒకటికొకటి వచ్చు<br>ఊహలు పెరిగి మత్తి ఊడలై - నీ కుదుటిని పెకలించి, బ్రతుకులన్ కృంగజేయును...! |
| 101. | కృంగిన బ్రతుకుల కని - ఏ రీతిన్ వెళ్ళతీతువో అని దిగుళ్ళ, దిగుళ్ళగా<br>కోట్ల కట్టలన్ మ్రింగినన్ - తీరనేర్చునా దాహము? దరిచేరలేవు దామోదరుని...! |
| 102. | అసంతృప్తియున్న కనలేవు - ఆ ఆదిదేవున్, సంతృప్తిని నీకిచ్చిన<br>జీవితము నేర్చిననాడే - అందగలవు ఆ ఆదినారాయణ మూర్తిన్...! |
| 103. | సంద్రమున కలియు నదుల్ తమతమ స్వభావ రుచుల గోల్పోయి<br>స్వచ్ఛతమై లయించు సాగరమున, తమ గుణముల నేరికి అడ్డులేక...! |
| 104. | నన్ను జేరు భక్తులు, ఆశ నిరాశల నొక్కపగిది జూడంగల నాడే<br>శివుని జటాజూట గంగయై బాసిల్లగా జేతు శీఘ్రమే...! |
| 105. | మాసమున నొకసారి వచ్చు - అమావాస్య పూర్ణిమలు రెంటిన్ రెండు కళ్ళుగ<br>మానసమందు లయించి - చూడగ నేర్చు స్థితి అందు, ఆ స్థితిమంతుడే నీవు...! |
| 106. | కోరకు ఆస్తులు, అంతస్తులని ఏడ్వకు - నీలో కల్గెడి ఆశ దురాశల అంతరింప చేయగన్<br>పుట్టిన జీవి పగిది నిర్లిప్తతన్ బ్రతక నేర్చి - నీ బ్రతుకును పండించు, అదే సౌభాగ్యమనుచు...! |
| 107. | పుట్టిన జీవి పగిది పుడమిన నడవమన్న నాదగు వాక్కున్<br>వ్యంగము జేసి  దిసమొలను తిరిగిన నిరామయుడు అనుకొంటివేమో, నిలువుము...! |

| | |
|---|---|
| 108. | నీ మదియందు నిశ్చలతను - జరుపుము కులవిధులను, నెఱపుము సఖ్యత నల్గురి లోనను<br>ముఖ్యత గను ప్రతి మనిషిపై మమతన్ విడవక భగవంతుని రూపమై దోచు సృస్టిన్...! |
| 109. | సంతృప్తాంత రంగుడవైతివేని సర్వము ఆ సర్వేశుని కాంచ గలవు, సంతృప్తిగ నిర్వహించిన నాడే,<br>సచ్చిదానంద రూపుడవై నీ నీ విధులన్, అందగలవు నిజమగు బ్రహ్మానంద స్థితి...! |
| 110. | పరుగులు మాను, నీ జీవిత పరమావధి అదికాదు<br>పడి లేచెడి గతుకుల బడుట నీ గతి కాదు, గంజినీళ్ళైనన్<br>పరమాత్మ డిచ్చిన పరమానంద మనుచు నిల్చి గ్రుక్కెడి<br>నాడే ఆ సంధాన కర్త పదసరోజములన్ చేరగలవు...! |
| 111. | అస్థిరమైన బ్రతుకున భవబంధముల్ తెంచుక పారిపోవ చూడ<br>కాళ్ళకు తీరని పాశములై మరుజన్మకు కారణంబులౌ...! |
| 112. | కనుక కలిగినది కలో గంజో సంతృప్తిగా తాగి<br>నీ సఖులకు సరిపంచు సమాన స్థితి, అదే నిశ్చల సమాధి స్థితి...! |
| 113. | చచ్చెడి చావుల కేడ్వకు, నిత్యము చచ్చెడి ప్రతి నిత్యము పుట్టెడి వారలకై దుఃఖ సంతసమేల?<br>జనన మరణంబులు అతిసహజ విషయము లంచున్ :<br>విడు విషయ వాసనల్, పూవుకు తావంటినట్లు తరించునీవు...! |
| 114. | ఆ దృష్టికన్న నీకు చావున్నదే ! నీవు నీవు గాదు ! నిను చంపగ ఎవరు నేర్తురు<br>ఈ తనువు ధరణిపై కూల - మరియొక తనువు నూతనమై అవతరించు...! |
| 115. | ఇంతకు నీ వెవరవు? తనువువా? ఆత్మవా? తరచి చూచి చెప్పుమిపుడు<br>నీదగు ఆత్మకు చావు ఉన్నదే - నీవు అజరామరుడవై అలరాడు ఆత్మవు...! |
| 116. | కాయమందితివోయి కర్మల కరిగింప జన్మజన్మలు<br>కరగ కాలమున్ ద్రోసి కమలాకాంతున్ కలియునందాక<br>నీ ఆత్మ నూతన రూపాల నందుచు పరమాత్మన్ —<br>పొందంగల స్థితికై అర్రుల జాచుచు అమరమై వర్ధిల్లు...! |
| 117. | ఎవడురా నిను చంపునది ! చచ్చున దెవరురా?<br>నీవు ఆత్మవు, పరమాత్మను జేరు, జన్మల చివరి పర్యంతమ్ము...! |
| 118. | గుంటల కుంటల చెరువుల - బావుల కాల్వల నదీ నదముల నీరు నానా రూపంబుల<br>నానా పరిధుల నీ కిచ్చిన పాత్రల - నటించితివి గాని అది నీవు గాదు, అది నీదగు ఆత్మే...! |

| | |
|---|---|
| 119. | సర్వం జగన్నాథ మయం - హరోం హర హర, భవ హర అనుచున్<br>నానా నీటి ప్రవాహముల్ సాగరంబున పడి లయించగ<br>నురుగులు క్రక్కుచు పరుగులు పెట్టును ప్రవాహమై...! |
| 120. | ఉరుకుము, ఉరుకుము నీ అవగుణముల - ఆ సూర్యుని తీక్షణతన్ ఆవిరి చేసినట్లు<br>నా నామ గుణరూపంబుల్ గానము - నాలిక నడయాడ నీ నిజస్థితి<br>నారాయణుంజేరి లయించ గలవే...! |
| 121. | ఆదిమధ్యాంత రహితుండ, నే సృష్ట్యాది పర్యంతము<br>అఖండ జ్యోతినై అంధకారము బాపితి సర్వజీవులకున్<br>మినుకు మినుకుమని కునికెడి  మీ ఆత్మలు - పరమాత్మన్ చేరి లయించగ సిద్ధముకండి...! |
| 122. | వెన్నుతట్టి, ఆత్మజ్ఞానివై మనసున్ తట్టి - నాదగు పిల్పుల్ వింటివేని<br>ఆ స్థితి బ్రహ్మానంద స్థితి మంతుడవై - ఆ బ్రహ్మము జ్యోతి నందగలవు...! |
| 123. | బ్రహ్మజ్యోతి నందు - అందాక జన్మల నెత్తు పాపకర్మంబుల్ ఆచరించుటకున్<br>అందాక ఆత్మకున్ - చావు లేక అజరామరమై అలరాడుచుండు...! |
| 124. | కనుకను అవగుణంబులు హరించి - నిశ్చల మతివై స్థిత ప్రజ్ఞుడవైతివేని<br>నీ మతియందే గాక సర్వ జగతిన్ - బ్రహ్మానంద స్థితిన్ కనంగలవు<br>నాటిదాక నీకున్ ఆది అంతము నున్నదే...! |

## (6) (10-09; పన్నెండవ రోజు పారాయణము)

| | |
|---|---|
| 125. | తామెత్తిన జన్మలకు సంతృప్తిగ బ్రతుకనేర్చిన భాగ్యము ఎందరికున్నదో?<br>అడుగడుగున తనకు లేదంచు పరులకు కలిగినదంచు దుఃఖాల పొరలి అసంతృప్తులౌ వారెందరో? |
| 126. | కళ్ళు కాళ్ళు కాయము సర్వావయంబులన్ - ఆ దేవదేవుడు చల్లగ నిచ్చిన చాలదే !<br>మెల్లగ బ్రతుకుల్ వెళ్ళదీయుచు బ్రతికి - పదిమందిని బ్రతికింప భారంబగునా...? |
| 127. | పూర్వకృత సుకృతంబున - సుయోగములు కలుగ తానెంత పెట్టిపుట్టెనో<br>నాడంత కలిమి లేమి కలుగు - అంటదు అరచేతికైన అవతలి సొమ్ము...! |
| 128. | అవయంబుల అన్ని అమర్చితి, సంతృప్తుడవు కావా, ఇది బహు సంపన్నత కాదా..?<br>ఆ సరసిజనాభ పదసరోజము లంటగ నీ కంట నీరేల - నీ కంటని సిరులు వెంటబడి వచ్చునే...! |

| | |
|---|---|
| 129. | ఆ బండను బతికిన కప్పకైనా - తిండి అమర్చితి, ఇన్ని అమర్చిన నే తిన తిండి నీయగ లేనా?<br>ఏడుపు లేటికో - నీవేడ్చేటందుకే నే నిచ్చితి ఈ జన్మల కర్మలన్...! |
| 130. | స్థితప్రజ్ఞత ఏనాడు నేర్తువో? పుట్టుక నుండి నీ గిట్టుట వరకు<br>నాదని, నీదని, లేదని, ఏదని - ఏడుపులలోనే వెళ్ళబారే జీవితమంత...! |
| 131. | యోగైనన్ భోగైనన్ రోగైనన్ నీ కర్మఫలమే పంచితి నేను<br>నే వంచన ఎందుకు సేతునే పుట్టుక పెరుగుట గిట్టుట కారణంబు నీ సంచిత పాపకర్మమే...! |
| 132. | పట్టుపరుపు లిచ్చినన్ కట్ట పీతాంబరము లిచ్చినన్ - కనకపు మేడలిచ్చినన్<br>ఆ కల్పవృక్షమే దివినుండి దించి నీ పెరటిలో పెట్టినా<br>నీ నోట లేదంచు ఏడుపు రాదందువేని నీ కిత్తు ఆ కైవల్య పదమే...! |
| 133. | కామధేనువు నీ ముంగిట కట్టినన్ - కోర్కెల క్షీరముల్ పిండి పిండి - ఆ పొదుగున<br>రుధిరము వచ్చునేమో? లేదను నీ రోదనలకు ముగింపు ఉన్నదే? నీ బ్రతుకే ముగియు కాని...! |
| 134. | కనుక కలుగును కోరికల్ - ఊటలై పూటపూటకు ఊరుకవచ్చు<br>ఇచ్చిన కొలది వచ్చు మరికొన్ని కామితముల్ - ఊరివారి సొమ్ము ఊరక దిన అంతమున్నదా...! |
| 135. | బ్రతుక గంజి మెతుకులుండ - బారెడు గూడు నీడ నీవారనుకొన్న అమ్మన్, అలిన్,<br>సంతృప్తిగ బ్రతుకుల్ - వెళ్లదీయగన్, వెళ్ళవే ఈ జీవికి ప్రొద్దుల్...! |
| 136. | కొండను పిండి కొట్టంగ వచ్చు - బండను బహుబంగుల శిల్పముల చెక్కంగ వచ్చు<br>సకల ప్రాణికోటులన్ సృష్టించ సులువు - నరుల అజ్ఞానము బాప నే నలసిపోతి...! |
| 137. | బ్రతుకు లశాశ్వతములు ముంచుకు వచ్చు మృత్యువు కానగ లేరు<br>అనంతమైన కోరికలు మీ బ్రతుకును సుఖాంతముగ సేయలేవు,<br>నినున్ నీవు తెలుసుకొనుటే ఎన్నడు నేర్చుకొందువో...! |
| 138. | నన్ను తలచుకొను మాట ఎన్నటికి ? మరి ఎన్ని తరములు తరలునో...? |
| 139. | నీవా ఆత్మవు నేనా పరమాత్మన్ - నీ పాపకర్మల్ పరిహరించుటకై<br>భువిని అతిథివై నీ తోలుతిత్తుల - బడితివి కాని, ఈ క్షణిక సుఖముల్ అశాశ్వతముల్...! |
| 140. | శాశ్వతమైన ఆత్మకు అంటంగబోవు - అజ్ఞానమున అతికోరికలంద<br>పొందును నీ కాయమే, పొందగ లేడు - ఆ పురుషోత్తముని జ్ఞానమున్...! |
| 141. | కను కను స్థితప్రజ్ఞతన్ కను కను - కను నీ కలిగిన కలిమిలేమిన్ ఒక కంటన్<br>పొంగకు సుఖములన్ కని - కృంగకు దుఃఖాంభోధిన్...! |

| | |
|---|---|
| 142. | ఇంద్రియ సుఖముల మునుగకు ముదిమిని గని వగవకు, నీకున్న ప్రొద్దులన్ నీ కన్న అనాధలకు<br>అన్నార్తులకు సంరక్షణ చేసితివేని - సంతృప్తుడవై శ్రీరంగ రంగని జేరుదువే...! |
| 143. | రోగముల్ వచ్చెననుచు నెత్తినోరు బాదుక ఏడ్చిన, ఆ గడియల్ తప్పవు ! ఈ బాధలను భరించుటే<br>పాపములు కరగునటంచు తలచి భగవంతున్ తలపుల<br>నిలిపితివేమి, తరగని పెన్నిధినై నా సన్నిధి చేర్తుం గాదే...! |
| 144. | నిశ్చలతను మానస సరోవరముగా - నీ మనసు స్థితిమంతుడవై నిల్పినన్<br>గుంటల, కుంటల చెరువుల నీటికై - నీ మది ఆశించకపోదు అనిశ్చితతన్...! |
| 145. | సుఖంబన, కష్టంబన నీ మానస భావంబే ! ఆ భావము<br>భగవంతుని చేర్చ అభయంబు కలుగు, అసంభవమౌ బాధల గాథల్...! |
| 146. | నీ మానసోద్యానవనంబున భవ అనురాగ - పుష్పముల్ వెలయింప గొప్పుల్ త్రవ్వి<br>దోహద పడెదవేని సందోహ ఆనంద పారిజాతముల్<br>భగవదానుగ్రహ రేకులై, నీ హృదయ కుసుమంబే భగవర్పితము కాదా...! |
| 147. | భగవంతుని భక్తులు అందని భాగ్యమున్నదే? బ్రతుకున సౌరభముల్ వెదజల్లుచు<br>పాదులు చేసి భక్తిని నీరుగ పోయ - మరి కొన్ని బ్రతుకుల్ బ్రతుకంగ దోహద మవుదురే...! |
| 148. | భక్తిని దోసిలొగ్గి అంజలి ఘటించిన - మీ బ్రతుకులు జేర్తు భవబంధములు బాపి<br>ప్రియ బాంధవుడే నేననుచున్ ప్రియముగ - నివాళులివ్వన్ నాపక్కన అక్కున జేర్చుకుందురా...! |
| 149. | గొల్లల ఇళ్ల పాలు పెరుగు మక్కువ నడిగి తాగిన<br>ఆ కృష్ణమూర్తినే భక్తుల అనుగ్రహింప - మరలి వచ్చితి శిరిడి బృందావనిగన్...! |
| 150. | పిడికెడు అటుకులకే పిలిచి యొసగితిని  - భోగ భాగ్య కైవల్య పదంబుల్<br>భక్తుల వినయ పూర్వక ప్రార్ధనలే భగవంతుడనైన నే కొందు అజ్ఞలుగన్....! |
| 151. | భక్తికి దక్క ఏ అన్యమార్గములకు - అందబోను అందేదవేని నందనందనున్<br>నందనవనమే గదా హృదయారవిందములన్ - నిల్పు నాదగు పదధూళుల్....! |
| 152. | నే నెవ్వరినుండైన దక్షిణ అడిగితినేని మీ బ్రతుకుల రక్షణకే సుమా !<br>రెట్టుకు పదిరెట్లు ఇత్తు పది కాలాలు - మీ బ్రతుకులకు నే పొందుగ సన్నిధి ఇచ్చుటకు...! |
| 153. | నిర్మల మనస్కుడవై నిజ కష్ట ఫలంబున - ఇచ్చిన ఓ దోసెడు నీరమైనను ప్రియమున స్వీకరింతు<br>ఇచ్చెద నీకు ఎల్లప్పుడు పిలిచి రక్షణ, దక్షత లేని నీ బ్రతుకులకు<br>దక్షిణ కోరితి ప్రదక్షిణ సల్పిన చాలదే...! |

| | |
|---|---|
| 154. | రూపాయి కొక్క వరమంచు చౌక అనుచు నే వ్యాపారినై అమ్మ లేదు వరములు ఏనాడున్<br>ఆ ఫకీరు కోరెను రూప్యమనుచు నిందలు నాపై వేయ ఏడ్చితివి...! |
| 155. | అర్థుండవైన, నీ వర్థుండవైన నీ దక్షిణ లేటికి నాకు, నే నిచ్చుచునే ఉందు నీ వాంఛితార్థముల్<br>నీ వాంఛలు ఉడుగు నందాకైనన్ ముద్దల సుద్దిగ ముడుపును కట్టి<br>మిము ముదమారగ భక్తిన్ మదిలోన్...! |
| 156. | ఇచ్చెద నంటినని నింగికి నిచ్చెనల్ వేయకు - ప్రకృతిని పరిహసించెడి వరములను ఈయబోను<br>చిరంజీవివై నిలిచెదనంచు అచిరవాంఛల తీర్చగబోనులే<br>చిరకాలమెన్నడున్ చిరంజీవియై నిలువగబోడు ఎవ్వడున్...! |
| 157. | చిన్నది నీ జీవిత పథము నీ కర్మల దీర్చుకొనుచు- పదపద పద్మనాభుని పద పరంధామమునకున్ |
| 158. | ఎన్నేళ్లు బ్రతికినన్ వృత్తముల ప్రవృత్తములౌ - పాపపు సంచితముల్ కరుగగ<br>మరికొన్ని కొత్త జన్మల కోరి తెచ్చుకొందువే...! |

ॐ ॐ ॐ